పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై చర్చిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి: మంత్రి ప్రభాకర్

కార్పొరేషన్, మార్చి 3 : కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనున్నింటినీ త్వరలోనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హన్మకొండ్ క్యాంప్ కార్యాలయంలో కరీంనగర్‌కు చెందిన పలువురు తాజా మాజీ కార్పొరేటర్లతో ఆయన సమావేశమయ్యారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలపై సుదీర్ఘంగా చర్చించారు. పలు అంశాలపై ఆయన సలహాలు, సూచనలు ఇచ్చారు. కరీంనగర్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. త్వరలో కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం ఏర్పాటు చేస్తానని చెప్పారు. నగరవ్యాప్తంగా నిలిచిపోయిన పనులను ప్రత్యేక శ్రద్ధతో పూర్తి చేస్తామని తెలిపారు. సీఎంఏ గ్రాంట్స్ రావాల్సి ఉన్నాయని... వీటిని వినియోగిస్తూ పనులు చేపడతామన్నారు. కరీంనగర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత అంజన్ కుమార్, పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న పంచాయతీ కార్యదర్శి

పోగొట్టుకున్న నగదును బాధితుడికి అందిస్తున్న అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ. పక్కన కార్యదర్శి శ్రీనివాస్

కరీంనగర్, మార్చి 3 (నమస్తే తెలంగాణ)/ రామడుగు, మార్చి 3 : తనకు దొరికిన రూ. 50 వేల నగదును పోలీసులకు అప్పగించిన ఓ పంచాయతీ సెక్రెటరీ నిజాయితీని చాటుకున్నారు. రామడుగు మండలం గుండి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న సార్ల శ్రీనివాస్ సోమవారం విధులకు హాజరయ్యేందుకు కరీంనగర్ నుంచి గుండికి బయలుదేరారు. రామడుగు శివారులో కొత్తగా నిర్మించిన వంతెన వద్దకు రాగానే రోడ్డుపై యాభైవేల నగదు కనిపించింది. దొరికిన నగదును తీసుకున్న శ్రీనివాస్ వెంటనే చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు విషయాన్ని ఫోన్ ద్వారా వివరించారు. బాధితులను కనిపెట్టి అందజేయాలని ఆయన పోలీసులను కోరారు. వెంటనే స్పందించిన పోలీసులు, బాధితుడు రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన గంగు ఎల్లయ్యగా గుర్తించారు. తమ గ్రామంలో నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయానికి గానూ విగ్రహాల కొనుగోలుకు రామడుగుకు వస్తుండగా మార్గమధ్యంలో డబ్బును పోగొట్టుకున్నట్టు బాధితుడు పోలీసులకు తెలిపాడు. కాగా, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ నుంచి దొరికిన నగదును తీసుకొని కరీంనగర్ డీసీపీ కార్యాలయంలో శాంతి భద్రతల అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా గంగు ఎల్లయ్యకు అందజేశారు. దొరికిన నగదును పోలీసులకు అప్పగించి నిజాయితీ చాటుకున్న శ్రీనివాస్‌ను పోలీసులు అభినందించారు. ఇక్కడ సీఐ ప్రకాశ్, ఎస్సై శేఖర్ ఉన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- 35,562 మంది విద్యార్థులు.. 58 పరీక్ష కేంద్రాలు
- డీఐఈవో జగన్‌మోహన్ రెడ్డి

వివరాలు వెల్లడిస్తున్న డీఐఈవో జగన్‌మోహన్ రెడ్డి, అధికారులు

కమాన్‌చౌరస్తా, మార్చి 3 : ఇంటర్ పరీక్షలు ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని, ఇందుకోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఇంటర్ విద్యా శాఖ అధికారి జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డీఐఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన డీఈసీ సభ్యులు ఆంజనేయరావు, సత్యవర్ధన్ రావు, శశిధర శర్మ, మధుమోహన్ రావుతో కలిసి మాట్లాడారు. జిల్లాలో మొదటి సంవత్సరంలో 17,799 మంది, రెండో సంవత్సరం 17,763 మంది మొత్తం 35,562 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని వెల్లడించారు. జిల్లాలో 58 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థులను 60 నిమిషాల ముందు నుంచి పరీక్ష కేంద్రంలోనికి అనుమతిస్తారని తెలిపారు. విద్యార్థులు తమ హాల్ టికెట్‌ను ఆన్‌లైన్ నుంచి సైతం డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద 50 మంది సీఎస్‌లు, 58 మంది డీవోలను ఏర్పాటు చేశామని, అలాగే, డీఈసీ సభ్యులు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, నాలుగు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం పరీక్షలను పర్యవేక్షించనున్నట్లు వివరించారు. పరీక్ష కేంద్రంలో ఒక ఏఎన్ఎం లేదా ఆశ కార్యకర్త అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. విద్యార్థులు సరాసరి పరీక్ష కేంద్రానికి వెళ్లేలా లొకేషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్ష కేంద్రం విషయంలో అనుమానాలు ఉంటే టీఏసీఐఈ ఎం. సర్వీస్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చని వివరించారు. పరీక్షల్లో ఇన్విజిలేటర్ల కొరత కారణంగా జిల్లా విద్యాశాఖాధికారి సహకారంతో ఉపాధ్యాయులను ఉపయోగించుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఆయా రూట్లలో పరీక్షకేంద్రాలకు ప్రశ్నపత్రాలు చేరుకున్నాయని తెలిపారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

వీణవంక, మార్చి 3: వీణవంక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సోమవారం మల్లారెడ్డిపల్లి అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన తాండ్ర శ్రీనివాస్ ఇటీవల ప్రమాదంలో మృతిచెందగా, అతడి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు పరీక్ష ప్యాడ్‌లను వితరణ చేశారు. వాటిని మాజీ ఎంపీటీసీ తాండ్ర శంకర్, అమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు గోనెల సమ్మయ్య ఇంటర్మీడియెట్ విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవీందర్, అధ్యాపకులు భాస్కర్, సుమలత, జైపాల్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదువాలి

సైదాపూర్, మార్చి 3: విద్యార్థులు ఇష్టపడి చదువాలని ప్రముఖ మోటివేటర్ బొట్ల రామస్వామి సూచించారు. మండలంలోని వెన్నంపల్లి జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చక్కగా చదివి పరీక్షల్లో ప్రతిభ చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డంప్ యార్డ్ ప్రతిపాదన విరమించుకోవాలి

హుజూరాబాద్ టౌన్, మార్చి 3: వరంగల్ జిల్లా మడికొండలోని డంప్ యార్డ్‌ను హుజూరాబాద్‌లో ఏర్పాటు చేద్దామనే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని హుజూరాబాద్ ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ.. మడికొండ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించే సరికి అక్కడి డంప్ యార్డ్‌ను ప్రభుత్వ అధికారులు చాకచక్యంగా హుజూరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. దీని వల్ల హుజూరాబాద్ చుట్టూ ఉన్న పది గ్రామాల ప్రజల జీవనానికి తీవ్ర విఘాతం కలుగుతుందని, ఇక్కడి వాతావరణం కలుషితమై శ్వాసకోశ వ్యాధులు, క్యాన్సర్, అలర్జీ వంటి సమస్యలు ఏర్పడతాయని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని, డంప్ యార్డు ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకోవాలన్నారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు వేల్పుల రత్నం, పాక సతీశ్, వేల్పుల ప్రభాకర్, డాక్టర్ తడికమళ్ల శేఖర్, మార్త రవీందర్, తునికి సమ్మయ్య, సందెల వెంకన్న, ఇమ్మడి దయాకర్, రామ్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

పల్లె ప్రకృతి వనంలోని చెట్లు దగ్ధం

పాక్షికంగా దగ్ధమైన పల్లె ప్రకృతి వనం

గన్నేరువరం, మార్చి 3: మైలారంలోని పల్లె ప్రకృతి వనానికి ఆదివారం గుర్తు తెలియని ఆకతాయిలు నిప్పంటించడంతో పల్లె ప్రకృతి వనం పాక్షికంగా దగ్ధమైంది. ఘటనా స్థలాన్ని సోమవారం ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గుర్తుతెలియని ఆకతాయిలు నిప్పంటించి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. పల్లె ప్రకృతి వనంలోని సుమారు 200చెట్లు కాలిపోయాయని తెలిపారు.

'బదులు' వర్కర్ల దరఖాస్తులపై నివేదిక ఇవ్వాలి

కార్పొరేషన్, మార్చి 3: ప్రభుత్వ నిబంధనల ప్రకారం నగరపాలక సంస్థకు వచ్చిన బదులు వర్కర్ల దరఖాస్తులపై వారం రోజుల్లో పూర్తి స్థాయిలో వెరిఫికేషన్ చేసి, కచ్చితమైన రిపోర్ట్ అందించాలని నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ప్రత్యేక కమిటీని ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక కమిటీ సభ్యులు డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి, ఏసీపీ బషీర్, అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, సంజీవ్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. నగరపాలక సంస్థ గుర్తించిన మొత్తం 67 మంది బదులు వర్కర్ల నుంచి పలు దరఖాస్తులు రాగా, వచ్చిన వాటిని మూడు కేటగిరీల్లో వెరిఫికేషన్ చేసి సరైన రిపోర్టును సమర్పించాలని కమిషనర్ కమిటీకి సూచించారు. బదులు వర్కర్లకు సంబంధించి 61 సంవత్సరాలు పైబడిన వారితో పాటు చనిపోయిన, పూర్తిగా అనారోగ్యానికి గురైన వారిని పరిగణనలోకి తీసుకొని వార్డు ఆఫీసర్లతో క్షేత్ర స్థాయిలో వెరిఫికేషన్ చేయాలని కమిటీని ఆదేశించారు.

మండల వాసికి కరాటే బ్లాక్ బెల్ట్ సెవెంత్ డాన్ డిప్లామా

డాక్టర్ ఐలయ్యకు డిప్లామా అందజేస్తున్న రాపోలు సుదర్శన్

చిగురుమామిడి, మార్చి 3 : చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన డాక్టర్ బొల్లి ఐలయ్య ముదిరాజ్ రికగ్నిషన్ కియో కరాటే బ్లాక్ బెల్ట్ సెవెంత్ డాన్ డిప్లామా పొందారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ గ్రాండ్ మాస్టర్ రాపోలు సుదర్శన్ అఫీషియల్ బ్లాక్ బెల్ట్ డిప్లామా ప్రదానం చేశారు. రాష్ట్రంలో కరీంనగర్ జిల్లా నుంచి డాక్టర్ ఐలయ్య కరాటే డిప్లామా అందుకోవడం అభినందనీయమని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. బొల్లి ఐలయ్య కరాటేలోని చివరి డిప్లామా అందుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్టేట్ ట్రెజరర్ మల్యాల రామస్వామి, జహంగీర్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ అబ్జర్వర్ ఓంకారనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందన

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు, మార్చి 3 : మండలంలోని వెలిచాల శ్రీ సరస్వతీ హైస్కూల్ విద్యార్థులు ఈ నెల 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపగా, సోమవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తన నివాసంలో పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పాఠశాలకు చెందిన అశ్విత్‌కుమార్ బంగారు పతకం, మేఘన, శ్రీహాసిని, సింధు తామ్ర పతకాలు సాధించినట్టు పాఠశాల కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ తెలిపారు. కాగా, రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో మంచి ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎమ్మెల్యే నగదు ప్రోత్సాహకాలు అందించారు. ఇక్కడ వెలిచాల మాజీ సర్పంచ్ వీర్ల నర్సింగరావు, కరాటే శిక్షకుడు శరత్, తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి ఉదారత

తిమ్మాపూర్ రూరల్, మార్చి 3: మండలంలోని మన్నెంపల్లి గ్రామంలోని హమాలీ కార్మికులకు సోమవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, గ్రామ మాజీ ఉపసర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్ చేతి రుమాళ్లు పంపిణీ చేసి ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవి దృష్ట్యా నిత్యం ఎండలో కష్టపడే హమాలీ కార్మికుల సౌకర్యం కోసం హై క్వాలిటీకాటన్ చేతి రుమాళ్లు పంపిణీ చేశానని తెలిపారు. ఈ సందర్భంగా పొన్నం అనిల్ గౌడ్‌కు హమాలీ కార్మికులందరూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హమాలీ సంఘం అధ్యక్షుడు నాంపల్లి తిరుపతి, సానగొండ నరసింహస్వామి, నాంపల్లి శంకర్, దుర్గం జంపయ్య, గ్రామానికి చెందిన హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్

హుజూరాబాద్ రూరల్, మార్చి 3: హుజూరాబాద్ మండలం సింగాపూర్ గ్రామంలోని వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకున్నది. విద్యార్థులే స్వయంగా ఘుమఘుమలాడే రుచికరమైన వివిధ రకాల సంప్రదాయ వంటకాలు సిద్ధం చేసి వడ్డించారు. ఈ సందర్భంగా వీఎస్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎన్ హనుమకుమార్ మాట్లాడుతూ.. మనుగడకు ఆహారం ఎంతో ముఖ్యమని, దానిని వృథా చేయవద్దని సూచించారు. అందరికీ మంచి పోషకాహారం అందినప్పుడే ఆ దేశం అభివృద్ధి చెందిన జాబితాలో చేరుతుందన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నాయకుల నిరసన

కమాన్‌చౌరస్తా, మార్చి 3: జాదవ్ పూర్ యూనివర్సిటీ విద్యార్థులపై దాడికి పాల్పడిన టీఎంసీ గూండాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం శాతవాహన యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన గేట్ ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్షుడు చిట్యాల రాజు, ప్రధాన కార్యదర్శి ఇందురి రాజేశ్, నాయకులు మహేందర్, సందీప్, సాయికుమార్, దీక్షిత్, అరుణ్, సందీప్, వసంత్, నరేశ్, ప్రవీణ్, వినోద్, భీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ప్లాట్లకు అడ్డుగా గ్రిల్ డివైడర్

- ఆందోళనలో ప్లాట్ల యజమానులు

కేశవపట్నంలో ఎన్‌హెచ్-563 జాతీయ రహదారిపై ప్లాట్లకు దారి లేకుండా వేసిన డివైడర్

శంకరపట్నం, మార్చి 3: ఓపెన్ ప్లాట్లకు అడ్డుగా ఇనుప గ్రిల్‌తో కూడిన డివైడర్ వేయడంతో రోడ్డు పక్కన గల ప్లాట్ల యజమానులు ఆందోళన చెందుతున్నారు. తాడికల్-కేశవపట్నం శివారులోని బైపాస్ రోడ్డు కరీంనగర్-వరంగల్ పాత రోడ్డును కలిసే దగ్గర అండర్ పాస్‌తో కూడిన ఫ్లై ఓవర్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇక్కడ రోడ్డుకు ఇరువైపులా సర్వీస్ రోడ్లు నిర్మిస్తుండగా, రోడ్డు చివరన నిర్మించిన డ్రైనేజీ మీదుగా డివైడర్ వేశారు. దీంతో హుజూరాబాద్ నుంచి కరీంనగర్ వైపు రోడ్డుకు కుడి పక్కన గల అనేక మంది ప్లాట్లకు దారి లేకుండా పోయింది. అప్పటికే ఒకవైపు మిషన్ భగీరథ పైప్‌లైన్ ఉండగా, మరోవైపు నుంచే రోడ్డకు కావలసిన 200 ఫీట్లను సేకరించారు. దీంతో అనేక మంది విలువైన ప్లాట్లను కోల్పోగా ప్రభుత్వం అరకొర సాయం విదిల్చింది. రెక్కలు ముక్కలు చేసుకుని కూడబెట్టి ప్లాట్లు కొంటే రోడ్డు విస్తరణ రూపంలో ఆశనిపాతం ఎదురైంది. పిల్లల చదువులు, పెళ్లిళ్లు, తదితర భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడతాయి అనుకున్న ప్లాట్ల యజమానులకు దిగమింగుకోలేని దుఃఖాన్ని మిగిల్చింది. కలెక్టర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న ఆర్బిట్రేషన్‌లో కలెక్టర్ అయినా తమకు న్యాయం చేస్తారని ఏడాది నుంచి వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. మిగిలి ఉన్న కొద్ది పాటి స్థలాలను సైతం ఎన్‌హెచ్ అధికారులు చిన్న చూపు చూడడంతో ప్లాట్ల యజమానులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు వెంటనే డివైడర్‌ను తొలగించి రోడ్డుకు దారి ఉండేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. లేదా పెద్ద సంఖ్యలో ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME
★Reddaveni Pravalika W/o Reddaveni Sudheer Kumar, (Old Name), H.No. 12-7-117/1, Shiva Nagar, Sircilla Town & Mandal, Rajanna Sircilla Dist. My Name changing as per my Certificates, Garige Pravalika W/o Reddaveni Sudheer Kumar (New Name)
NTK-00000

CHANGE OF NAME
★Kairamkonda Rekha, W/o Kairamkonda (Old Name) Srikanth D/o Myaka Pochaiah, H.No. 7-60/6, Vill & Mdl: Thangallapally, Rajanna Sircilla Dist. My Name was changed to Myaka Neeraja (New Name)
NTK-00000

LOST
నేను మోర సత్యంబాబు @ మోర సత్యనారాయణ, తండ్రి: హనుమయ్య, నివాసం: గోదావరిఖని, మా ఇంటి నుంచి బైక్ మీద బస్టాండ్ (గోదావరిఖని) వెళ్తుండగా తేదీ: 06-02-2025 రోజున నా ఒరిజినల్ భూమి డాక్యుమెంట్ (కోహెడ గండి చెరువు వద్ద సర్వే నెం. 196 లోని 200 చ.గల. భూమి ప్లాట్ నెం. 299, డాక్యుమెంట్ నెం: 333/2000) పోయినది. దొరికిన వారు సంప్రదించగలరు: 7997662022.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

దరఖాస్తు గడువు పొడిగింపు

చిగురుమామిడి, మార్చి 3: చిన్న ముల్కనూరు మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు ఈ నెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ హర్జిత్ కౌర్ ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు 6వ తరగతిలో ప్రవేశం కోసం, 7, 8, 9, 10 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం http://telanganams.cgg.gov.in/ వెబ్‌సైట్ సందర్శించాలని సూచించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

గన్నేరువరం, మార్చి 3: మండలంలోని గుండ్లపల్లి ఎక్స్ రోడ్ వద్ద సోమవారం బస్సును కారు ఢీకొన్న ఘటనలో త్రుటితో ప్రమాదం తప్పింది. సిద్దిపేట నుంచి కరీంనగర్‌కు వస్తున్న స్విఫ్ట్ కార్ హైదరాబాద్ నుంచి ఛత్తీస్‌గఢ్ వైపు వెళ్తున్న ప్రైవేట్ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో దానిని ఢీకొని బోల్తాపడింది. కారులో ఎమ్మెల్సీ ఓట్ల కౌంటింగ్ కోసం కరీంనగర్ వస్తున్న ఐదుగురు ఉపాధ్యాయులు ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా: పలువురికి గాయాలు

కరీంనగర్ రూరల్, మార్చి 3: బొమ్మకల్ గ్రామంలో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ బోల్తాపడడంతో పలువురికి గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. సోమవారం బొమ్మకల్ గ్రామంలోని మానేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మైనర్ వేగంగా నడపడం వల్ల గోధుమ కుంట వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. గాయపడిన వారిని కరీంనగర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారని స్థానికులు తెలిపారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

వీణవంక, మార్చి 3: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సైన్స్ ప్రయోగాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఈవో శోభారాణి విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలను పరిశీలించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులు సాయిచరణ్, వనం ప్రణవి, అకరాల అక్షయ్, మిట్టపెల్లి వర్షిత్, అయేషా, వరుణ్, హరిచరణ్‌కు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పులి అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన

జమ్మికుంట(హుజూరాబాద్), మార్చి 3: జమ్మికుంట పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో పుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రామగుండం అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ మనోజ్‌కుమార్ బృందం సోమవారం స్థల పరిశీలన చేసింది. పుట్‌ఓవర్ బ్రిడ్జి లేక పట్టణ ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, హనుమకొండ జిల్లాలోని ఉప్పల్‌లో అసంపూర్తిగా ఉన్న ఆర్వోబీతో, బావుపేటలో నూతన ఆర్వోబీ నిర్మించక పోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని ఎంపీ ఈటల రాజేందర్ రైల్వే శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన క్రమంలో అధికారులు ఆయా చోట్ల పర్యటించి పరిశీలించారు. జమ్మికుంట పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో పుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, ఉప్పల్ అసంపూర్తిగా ఉన్న ఆర్వోబీని ఆరు నెలల్లో పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. బావుపేటలో నూతన ఆర్వోబీ నిర్మాణానికి ప్రతిపాదనలు సత్వరమే పూర్తి చేసి ప్రైవేటు అధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు. వారి వెంట నాయకులు ఎర్రబెల్లి సంపత్‌రావు, జీడీ మల్లేశ్, మోతె స్వామి, ఇటికాల స్వరూప, ఇనుగాల రత్నాకర్ ఉన్నారు.

మహాసభ జయప్రదం చేయాలి

తెలంగాణచౌక్, మార్చి 3: నగరంలోని ఏఐటీయూసీ కార్యాలయం బద్దంఎల్లారెడ్డి భవనంలో ఈనెల 16 తేదీన నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్, కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ మహాసభను జయప్రదం చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య పిలుపు నిచ్చారు. ఈ మేరకు కార్యాలయంలో సోమవారం మహాసభకు సంబంధించి వాల్ పోస్టర్‌ను సంఘం జిల్లా నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్నయాదవ్, ప్రధాన కార్యదర్శి పిట్టల సమ్మయ్య, నాయకులు జంగ కొమురయ్య, ఐలయ్య, నరేందర్, ఓదయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, మార్చి 3: నగరంలోని 11కేవీ చింతకుంట ఫీడర్‌లో లైన్ మెయింటనెన్స్ పనులు చేపడుతున్నందున మంగళవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ ఏడీఈ జీ రఘు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8నుంచి 11గంటల వరకు చింతకుంట, గాంధీనగర్, రాజీవ్ గృహకల్ప-1 ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

తల్లిదండ్రులకు పాదపూజ

తల్లిదండ్రులకు పాదపూజ చేసి ఆశీర్వాదం పొందుతున్న విద్యార్థులు

చొప్పదండి, మార్చి 3: పట్టణంలోని వీణాధరి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. సోమవారం పాఠశాల కరస్పాండెంట్ తిప్పర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆశీర్వాద కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తల్లిదండ్రులకు పాదపూజ చేసి వారి ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ, మన సంస్కృతీసంప్రదాయాలను గౌరవించాలన్నారు. విద్యార్థులు పరీక్షలంటే భయాన్ని వీడి, పట్టుదలతో చదివితే విజయం తప్పక సాధించొచ్చని ఉద్బోధించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆంజనేయులు, రాజమౌళి, చంద్రశేఖర్, మహేందర్, మధుసూదన్, వనజ, సత్యనారాయణ రెడ్డి, దివ్య, సరిత, శ్రీనివాస్, దీపిక, సాహితీ, సౌమ్య, తేజ, సువర్ణ, లాస్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం భార్యను కొట్టిన భర్తపై కేసు

జమ్మికుంట(హుజూరాబాద్), మార్చి 3: అదనపు కట్నం కోసం భార్యను కొట్టిన వ్యక్తిపై జమ్మికుంట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. జమ్మికుంట మండలం గోపాలపురానికి చెందిన వనజకు మూడేండ్ల క్రితం పెద్దపల్లి జిల్లా ఓదెల గ్రామానికి చెందిన ఎలుకపల్లి రాజశేఖర్‌తో వివాహం జరిగింది. ఆ సమయంలో కొంత నగదుతోపాటు ఇతర లాంఛనాలు వనజ తల్లిద